
కథ

# మళ్లెప్పుడొస్తాది వరద?

డా॥ వి. పోతన్న



''ఒసేయ్! ఎర్రోని పెండ్లామా! కర్రిదానా! 'రేడీ'వోళ్ళు యామన్నా సెప్పినారా'' అంటూ వేపచెట్టు కింద కూర్చొని, ఆదారి వెంట పోతున్న వెంకటలక్ష్మిని అడిగింది సుంకులమ్మ. ఆ మాటలో 'ఎగతాళి' లేదు. బతుకు బాధ ఉంది. అలవాటు ప్రకారం పిలిచింది. ఇంకో సమయంలో అయితే వెంకటలక్ష్మి విసురుగా సమాధానం చెప్పేదే. సుంకులమ్మ మానసిక పరిస్థితి తెలుసుకోని ''నాకు తెలీదవ్వా!'' అంది. వెళ్ళిపోయింది. ఇంక ఎవరొస్తారా అని చూసింది సుంకులమ్మ. నాగలక్ష్మి వచ్చింది.

''పిల్లా! బండోని సుట్టమరాలా! 'టీఈ'వోళ్ళు యామన్నా సెప్పినారా'' అంది. సుంకులమ్మ వైపు బిరుసుగా చూస్తూ 'ఈ ముసల్దాని కండ్లబడితే సాలు... సుట్టమరాలా! సుట్టమరాలా! అని కాకి మాద్రి పొడుసుకు తింటుంది' అని మనసులో అనుకుంది. వెంటనే గుర్తుకువచ్చి – 'అవ్వకు కలిగిన నొప్పికంటే నన్ను అన్నమాట శానా తక్కువేలే' అనుకుంది. పలకకుండా నాగలక్ష్మి వెళ్ళిపోయింది.

'యాందో! .. యవర్ని అడిగినా సెప్పరు' పిచ్చి పట్టిన దానిలా తనలో తాను గొణుగుకుంటూ ఆకాశం వైపు చూసింది సుంకులమ్మ. తనకు కావలసిన మబ్బులు అక్కడ కనిపించకపోవడంతో నేల కేసి చూస్తూ వక్కాకు సంచిలోకి చెయ్యిపెట్టింది. 'ఆకూ–వక్కా' దొరకలేదు. పచ్చనోట్లు చిక్కాయి. వాటిని బయటికి తీసింది. తిప్పితిప్పి చూసింది చిత్తు కాయితాల్లాగా.

కేశన్న చూసి – ''యంత బయ్యంల్యాకుండా లెక్క పెడతాండావత్తా! ఉద్దరగా వచ్చినాయని తాత్సారమా? నోట్లు గాలికిపోతాయి. తిత్తిలో పెట్టుకో'' అన్నాడు. కేశన్న మాట వినీ... వొంచిన తల పైకెత్తి, నోట్ల గొంతును పిడికెట్లో పట్టుకొని ''కేసిగ్యా! నువ్వా! పట్నం పోతాండావా? నువ్వు తిరిగొచ్చేటప్పుడు మల్లెప్పుడొత్తాదో వరద అడిగిరా'' వర్షం కోసం రైతు ఎదురుచూసినంత ఆశ – ఆ గొంతులో ఉంది. గొంతు జీరబోయింది.

కేశన్నకు కోపం వచ్చింది. ముక్కుపుటాలు అదిరినాయి. నోట్లో నాలుక మడతపడింది. చూపులకు పదను వచ్చింది. ముందుకేసిన అడుగు వెనక్కి తీస్తూ – ''దరిద్రందానా! శనిముండా! నీకేం పొయ్యేకాలమే! ఏందో! పాపం. ముసిల్దికదాని వరద నీట్లో కొట్టుకుపోయేదాన్ని – బుజం మీద యత్తుకొనిపోయి రచ్చిత్తే మల్లెప్పుడొత్తాది వరద అంటావా? అపశకునందానా! ఇప్పుడొచ్చింది సాల్దా! కొంపాగోడూ, గొడ్డూగోదుమా... గింజాగిత్రా ఏట్లో కొట్టుకొనిపోయి... కూడో రామసెంద్రా అని నెత్తీ నోరూ మొత్తుకొని పాణాల్తో బయటపడితిమి. సెట్టూ పుట్టా పట్టుకొని గడ్డనపడితిమి. ఇప్పుడు నీకు మల్లా వరద రావల్నా! నీకేమే ముందూ ఎనకా ఎవరూ లేరు. నువ్వు సచ్చిన ఏడిస్సేవాళ్ళు లేరూ! బతికినా నగేవోళ్ళు లేరు. మేం పిల్లలు గల్లోళ్లం. తంతాను సూడు ఇంగోసారి అన్నావంటే'' అంటూ సుంకులమ్మ దగ్గరకు పోయాడు కేశన్న. ఎంత వేగంగా పోయాడు అంతే వేగంగా ఆగిపోయాడు. మళ్ళీ వరద రావాలని సుంకులమ్మ ఎందుకు కోరుకుంటుందో తెలుసుకున్నాడు. కోపం పోయింది. కరుణ కురిసింది. 'అయ్యో! పాపం' అన్నాడు.

''శా...శా!'' అనుకున్నాడు. ఇక అక్కడ ఉండలేక సరసరా వెళ్ళిపోయాడు. కోపంతో ఉరికి వచ్చిన కేశన్న పిడికిలితో గుద్ది సంపుతాడని భయపడింది. ప్రాణం మీద తీపితోకాదు. తన కోరిక నెరవేరదని. ఆ తర్వాత ఎవరూ కనిపించకపోవడంతో కాసేపు ఊరికే కూర్చుంది. జీవంలేని కళ్ళల్లో 'జలం' పుట్టింది. అది ఉబికి ఉబికి పొంగింది. వరద కోపం గంగరూపంలో సుంకులమ్మ కళ్ళల్లో మళ్ళీ దూకింది. ''నీకు దూము తగలా! నిన్ను గద్దలు పీక్కుతిన్నూ! తిక్కోని తలకాయ మీద ఊకే కూచ్చోక మాకాటికి ఏంటికొచ్చినావే! వచ్చినదానివి మమ్మల్ని రచ్చించాల్సింది పోయి యందరి పాణాలు తీసినావే పాపిస్టిదానా'' అని గంగను తిట్టింది. తిడుతూ తిడుతూనే ఏడ్చింది. ఏడుస్తూ.. ఏడుస్తూ తన బతుకునంతటినీ గుర్తుచేసుకుంది.

***

నలవై ఏళ్ళ కిందటి మాట. కూటికోసం పొట్టు తప్పని వెంకటన్న కాస్త పచ్చగున్నచోటుకు వలస పోయాడు. కడుపుతో ఉన్న భార్యనూ, పసిబిడ్డలనూ అత్తగారి ఇంటి దగ్గర విడిచిపెట్టి నలుగురితో పాటు తానూ కూలి పనులకెళ్ళాడు. చెరువు కట్ట నిర్మాణం పనుల్లో మట్టిపని చేయటానికి మేస్త్రీ దగ్గర కుదిరాడు.

ఉక్కు లాంటి మనిషి.

కండలు తిరిగిన దేహం.

నల్లగా ఉన్నా ఆకర్షణీయమైన రూపం. ఎర్రటెండకు గట్టిపడిన మట్టిని వెంకటన్న గడ్డపారతో పెళ్ళగిస్తూ ఉన్నాడు. మట్టిగడ్డలు నల్లగుండ్లు లాగా దొర్లుకుంటూ వస్తున్నాయి. కొన్ని పిండి అవుతున్నాయి. తొగిన మట్టి, రాశి కాగానే పెళ్ళగించడం నిలిపివేసి పారతో గంపలో నింపుతున్నాడు. నిండిన గంపను 'సుంకులమ్మ' నెత్తిమీదికి ఎత్తుతున్నాడు వెంకటన్న. గంప ఎత్తినప్పుడల్లా సుంకులమ్మ కళ్ళల్లోకి చూస్తున్నారు. నాలుగు చేతుల సహాయంతో మట్టి గంప గాలిలోకి లేచినప్పుడల్లా సుంకులమ్మ ఎదఎత్తులను దగ్గరుండి చూస్తున్నాడు. గంప ఎత్తే నెపంతో సమయం దొరికినప్పుడల్లా చూపులతోనూ, పెదవులతోనూ ఆమె సొగసులను పలకరిస్తున్నాడు. వెంకటన్న చేష్టలు ఎంత ఇష్టంగా వున్నా, హద్దు మీరుతున్నాడని తెలుసుకున్న సుంకులమ్మ ''మా నాయనతో సెప్పుతా'' అంది – కళ్ళతో నవ్వుతూ.

''నువ్వు సెప్పవు'' అన్నాడు వెంకటన్న.

''నేనంటే అంత ఇట్టమా'' అడిగింది సుంకులమ్మ.

''నీ మీద ఒట్టు''


''ఇప్పుడు నమ్మను. నన్ను కట్టుకున్నప్పుడు నమ్ముతా''


''ఇట్లే ఉంటే యట్ల కుదురుతాదీ! ఈ రేత్రికే లేసిపోదాం''.

''వద్దు! మా నాయన్ని అడుగు.''

అప్పటికే పెళ్ళి అయిన వెంకటన్న అడిగితే కుదిరే పని కాదని క్షణాల్లో తెలుసుకున్నాడు. కుదిరే మార్గం గురించి ఆలోచించాడు. ''మీ నాయన తాగుబోతోడు. నిన్ను 'సారా సీసాకి' అమ్మేత్తాడు. నాతో నువ్వు లేసి రావడమే మేలు'' అన్నాడు వెంకటన్న. తన తండ్రి గురించి వెంకన్న మాటలో అంతా సత్యమే లేకపోయినా ఎంతోకొంత నిజం ఉందని అనుకుంది సుంకులమ్మ 'సరే' అంది.

వెంకటన్న తాళి కడతాను, కడతాను అంటూ కాలాన్ని జరుపుకుంటూ పోయాడు. అప్పటికే సుంకులమ్మ కడుపులో ఉన్న శిశువు 'నమ్మద్దు... నమ్మద్దు' అన్నట్లు పొట్టలో కదులుతూ తిరిగింది. ఉంచుకుందాంలే అని తెచ్చుకున్న వెంకటన్న 'తాళి ... తాళి' అంటూ సుంకులమ్మ పట్టుపట్టడంతో తప్పించుకోవాలనుకున్నాడు. పట్నం వెళ్ళి 'బొట్టు' తెస్తానని చెప్పి పారిపోయాడు. సుంకులమ్మ బతుకు చెడింది. తండ్రి దగ్గరకెళితే సారా సీసాకు కాకపోయినా రూపాయికి అమ్మేస్తాడు. 'వద్దు' అనుకుంది. వెంకటన్న కోసం ఒంట్లో ఓపిక ఉన్నంత కాలం వెతికింది. కనిపించకపోయేసరికి కంట్లో నీళ్ళు ఇంకిపోయేవరకూ ఏడ్చింది. ఆ తర్వాత తన బతుకు తాను వెతుక్కుంది. పుట్టిన కొడుకును చెమట బొట్టుతో రెప్పల చాటున పెంచి పెద్దచేసింది. వయసు రాగానే తగిన జత చూసి పెళ్ళి చేసింది. గతం గుర్తుకు వచ్చినప్పుడల్లా ఆ బరువును దింపుకోవటానికి తను ఆత్మీయులనుకున్నవాళ్ళకు చెప్పింది. దాన్ని క్రమక్రమంగా కాలం మోసుకెళ్ళి ఊరు మొత్తానికి చెప్పింది. 'మోసపోయిన సుంకులమ్మ' అనటానికి బదులుగా 'లేచివచ్చిన సుంకులమ్మ' అని స్థిరపడింది. అప్పటికే సుంకులమ్మ ముసలమ్మ కావడం వల్ల దాన్ని తేలికగా






తీసుకుంది. ''అలగా జనానికి ఇలాంటివి మామూలే'' అని ఊరి జనం అనే మాట విని సుంకులమ్మ కొడుకు మద్దిలేటి బాధపడ్డాడు. బాధ పడినా చేసేది లేక అలవాటుపడిపోయాడు.

కర్నూలు నగరం వీపున, వీపుకు ఆనుకొని ఉన్న కల్లూరు పక్కన...

కల్లూరుకు కొంతదూరంలో హంద్రీ నది ఒడ్డుకు కొంచెం ఎడంగా ఉన్న గుడిసెల్లో కొడుకు దగ్గర సుంకులమ్మ హాయిగా బతుకుతూ ఉంది. కొడుకు – కోడలు కూలికిపోతే, మనుమడ్ని ఒడిలో పడుకో బెట్టుకొని జోకొడుతూ వాని బోసినవ్వుల్లో గతం గాయం మిగిల్చిన గుర్తులను మరచిపోయింది.

నాయనమ్మ నీడలో వేలిడంత మనమడు జానె డంత అయినాడు. జానెడంతవాడు – మూరెడంత ఎదిగినాడు. మూరెడంతవాడు పరుగెట్టేవాడై నాడు. కొడుకును పెంచే బాధ్యత సుంకులమ్మ మీదనే ఉంచి భార్యాభర్తలిద్దరూ కూలికోసం – కూటికోసం అంకితమైనారు.

***

కొత్తకోడలు అత్తగారింటికి వెళ్ళినట్లు ఆకాశంలో మబ్బులు నడవలేక నడవలేక నడుస్తున్నాయి. కోడలు మీద అత్త పెత్తనం చెలాయించినట్లు .. వచ్చిన మబ్బులను చిత్తడి ఎండలు కసిరించుకొని చూస్తున్నాయి. గుడిసె ముందర నులకమంచం మీద కూర్చున్న సుంకులమ్మ మబ్బును చూసిన ప్పుడు హాయిగా ఊపిరి పీల్చుకుంటూ ఉంది. ఎండ తగిలినప్పుడు ఊపిరి దిగమింగుతోంది. కొడుకు-కోడలు ఇరుగు పొరుగు వాళ్ళతో కలిసి కూలికి వెళ్ళారు.

మనుమడు ఆడుకోవటానికెళ్ళాడు.

పొద్దుపోక రేడియో 'మర'ను మెడకాయ విరిచి నట్లు తిప్పింది సుంకులమ్మ. మెటికలు విరిచినట్లు 'టఫ్' అని శబ్దం చేస్తూ రేడియో పలికింది. 'చిట పట చినుకుల మేళం' అనే పాటను కాసేపు పాడింది రేడియో. ఆ తర్వాత జలుబు చేసిన మనిషి గురకపెట్టి నిద్రపోతున్నట్లు అరిచింది. 'దీని కేమి రోగమో' అంటూ మెడకాయ వెనక్కి తిప్పి ఆఫ్ చేద్దాం అనుకుంది. అంతలో అది మళ్ళీ పలక డంతో అట్లే కూర్చుంది. వార్తల కార్యక్రమం మొద లైంది – ''బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీ డనం వాయుగుండంగా మారుతోంది. దీని ప్రభావం వల్ల రాగల ఇరవై నాలుగు గంటల్లో కోస్తా ఆంధ్రలో, రాయలసీమలో కొన్నిచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖవారు ఆకాశవాణికి చెప్పారు'' అంటూ పీలస్వ రంతో గంభీరాన్ని పులుముకొని చెప్పింది.

''అంతే – అంతేలే! ఆడయాడో గుండం లేసిన ప్పుడే ఈడ నాలుగు సినుకులు పడేది'' అను కుంది.

వార్తలు అయిపోయినాయి.

కర్నూలు ఎఫ్.ఎమ్. రేడియో – ముంబాయి కెళ్ళి హిందీ కార్యక్రమాలను తీసుకొని వచ్చింది. హిందీ భాష అర్థంకాక రేడియో ఆఫ్ చేసింది సుంకులమ్మ. వెలుగు నీడల్లో మంచం మీద నడుం వాల్చింది. కునుకు పట్టింది. అదికాస్త సాగింది. నిద్ర లేచేసరికి ఆకాశం మేఘావృతమై వుంది. చిను కుల సవ్వడి మొదలైంది. 'సల్లగుంది' అనుకుంది. చినుకుల్లో ఒక రవ్వ తడిసింది. ఆ తర్వాత ఇక చాల్లే అనుకుంది. గుడిసెలోనికి వెళ్ళింది. చినుకులు చూస్తూ కూర్చుంది. ఆడుకోవడానికి వెళ్ళిన మను మడు తుడుచుకుంటూ వచ్చి నాయనమ్మ ఒడిలో కూర్చున్నాడు. గుడిసెపైన కప్పిన ప్లాస్టిక్ పేపర్ల మీద పడిన చినుకులు టఫ్... టఫ్‌మని శబ్దం చేస్తు న్నాయి. వాటిని అనుకరిస్తూ మనుమడు నోటితో ధ్వని సృష్టిస్తున్నాడు. ఆనందంతో నవ్వుతున్నాడు. అది చూసి సుంకులమ్మ పెదాలు కూడా వికసిం చాయి. చీకటి కాస్త పరచుకునే సమయానికి కూలి పోయిన కొడుకు, కోడలు వచ్చారు.

''తడిసిపోయినావు గద బిడ్డా'' అంటూ కొడుకు నెత్తిని కొంగుతో తుడిచింది సుంకులమ్మ.

''ఈన్ని వాండ్లేకేంటికి పంపినావత్తా'' అంటూ తన బిడ్డ నెత్తిని తుడిచింది కోడలు.

ఇద్దరు తల్లులూ కన్నపేగుల్ని ప్రేమతో తడి మారు.

వంటలో లీనమైంది కోడలు...

''మద్దిలేటీ! వానొత్తుందంటరా! రేడీవోళ్ళు సెప్పినారు'' అంది సుంకులమ్మ.

''అవును నాయనా! టీ.వీలో కూడా సెప్పినా రంట. టీ బంకుకాడ అందరూ అనుకుంటాం డారు'' మద్దిలేటి కొడుకు కళ్ళు పెద్దవి చేసి చెప్పాడు.

''ఆ... ఏందొత్తాదిలే! ఇట్లా మాట్లు శానాసార్లు ఇన్యాం'' తేలిగ్గా కొట్టిపారేశాడు మద్దిలేటి.

''అన్నం అయింది. ఇంగ తిందురాండి'' అంది కోడలు. ఒట్టి చేపల కూరతో అన్నం రుచిగా తిన్నారు. తింటూ... తింటూ బతుకు గురించి నాలుగు మాటలు చెప్పుకున్నారు. ఆ తర్వాత పడ కల మీదికి చేరారు. ఉన్న గుడిసెలో కాళ్ళు ముడు చుకొని పడుకున్నారు. నిద్ర లేచే సమయానికి తూర్పున సూర్యుడు ఒళ్ళు విరుచుకుంటూ కనిపిం చాడు.

''నేను సెప్పల్యా! రేడియా మాట్లు ఇట్లే ఉంటాయి'' అన్నాడు మద్దిలేటి.

నిజమే! అన్నట్లు తల ఊపింది సుంకులమ్మ. కూలిపనికోసం గుడిసెల జనంతోపాటు కొడుకు – కోడలు వెళ్ళిపోయారు. వాళ్ళు వెళ్ళిన గంటకు మబ్బులు వచ్చాయి. ఆ దుప్పటి కప్పుకొని సూర్యుడు కనిపించకుండా పోయాడు. చెయ్యి కడు గుకొని విదిలించినట్లు మబ్బులు తలలు కదిలిం చాయి. నాలుగు చినుకులు నేలకు రాలాయి. 'మట్టి పువ్వు' వికసించింది. ఆ సన్నని పరిమళం మేఘం పీల్చింది. ఆనందం ఎక్కువైంది. వరుసలు వరుస లుగా చిన్నచిన్నగా చినుకుల ఉత్సవం మొదలైంది. కాసేపట్లో నడవడం మానేసి దూకడం మొదలైంది. దూకిన ప్రతి చినుకూ 'రేస్' గుర్రమైంది. చినుకుల ఉత్సవం పాకానికొచ్చింది. ఆకాశం పాలసంద్రమై పొంగింది.

ఉరుములు లేవు. మెరుపులు లేవు. కరిమబ్బుల జాడలు లేవు... నిండు కుండతో నీళ్ళు కుమ్మరించి నట్లు వాన కురవసాగింది. చినుకు ... చినుకు ఏకమై ఊసులాడుకుంటూ వాగుల వైపు పరుగె త్తాయి. అంతకుమునుపు చారెడు నీళ్ళు కూడా నోచుకోలేని హంద్రీ నది నవ్వుతూ సాగింది. గంటలు గడిచేకొద్దీ నవ్వడం ఆపేసి 'ఉరిమి' చూసింది. 'హంద్రీలో నీళ్ళొచ్చాయా! వరదొ చ్చిందా!' వింత అనిపించి జనం గొడుగులు పట్టు కొని వచ్చారు. గంటల ముళ్ళు నడిచినకొద్దీ ... గంగ ఎగురుతూ పోయింది. బుసకొడుతూ సాగింది.

వాన కాసేపు ఆగింది.

పగలు కావడం వలన చాలా సంఖ్యలో జనం హంద్రీ వాగు ఒడ్డున పోగయ్యారు.

''నదిలో నీళ్ళు ఎన్నాళ్ళకొచ్చాయో'' చాలా మంది ఆనందంతో అన్నారు.

''రాత్రివరకు ఈ వాన ఇట్లే కురిస్తే ఈ నది పక్కన ఉన్న ఇళ్ళు ఒక్కటి మిగలవు'' ఎవరో అన్నారు. దురాశతో, నది పక్కనే రియలెస్టేట్ వాళ్ళు వేసిన ప్లాట్స్‌లో పాతిన పొడుగాటి స్థంభాలు అప్పటికే కుతికిల దాకా మునిగాయి.

నది అందాన్నీ, గంగ సౌందర్యాన్ని చాలామంది చూస్తున్నారు. చూసినవాళ్ళు వెళ్ళిపోతున్నారు. చూడటానికి కొత్తవాళ్ళు వస్తున్నారు.

సుంకులమ్మ కూడా దూరం నుంచే చూస్తోంది. తోటి పిల్లలతో ఆడుకోవడానికి వెళ్ళిన మనుమని రాకకోసం ఎదురుచూస్తోంది.

***

కూలికోసం పొరుగూరికెళ్ళిన గుడిసెల జనం పని జరగకపోవడంతో తిరుగుముఖం పట్టారు. అప్పటికే వరద గంగమ్మ హంద్రీలో ఉరుకుతూ ఉంది. ఇంటికి త్వరగా చేరుకోవాలని జనం త్వరత్వరగా నది ఒడ్డుకు వచ్చారు. గంగ వేగాన్ని చూసి జడుసుకున్నారు. ''అమ్మో! యాడ దాటతాంలే'' అని చాలామంది అన్నారు. ''తాయ్! పిరికి నాయాళ్లారా! ఏట్లో లోతుంటుంది గానీ మనమొచ్చిన వంతిన మీద యాడుంటాది'' – మీసమున్నవాడు ఎవడో రోషంగా అన్నాడు. రోషంలేని వాళ్ళకు కూడా రవ్వంత ధైర్యం వచ్చింది. ఏటి నీటిలో కనిపించకుండా ఉన్న వంతెన ఎక్కడుందో గుర్తించారు.

''తాడు మాదిరి అందరూ ఒగరి సెయ్యి ఒగరు పట్టుకొని దాటుదాం'' ఎవరో సలహా ఇచ్చారు. ఉపాయం బాగుంది బాగుందని అందరూ మెచ్చుకున్నారు.

''తాయ్'' అన్న వ్యక్తి నీళ్ళల్లోకి ముందుగా దిగాడు. అతని చెయ్యి ఒకరూ... ఆ చెయ్యిని మరొకరూ ... దాన్ని ఇంకొకరూ... ఒకరి చెయ్యి ఒకరు పట్టుకున్నారు. చేతులు ఇనుప గొలుసులయ్యాయి.

నీళ్ళు మోకాళ్ళ దాకా వచ్చాయి.

నడుముల దాకా పెరిగాయి.

ఇంకాస్తా పైకి వచ్చాయి... అడుగులో అడుగేసుకుంటూ, అడుగు తీసి అడుగేస్తూ చీమల లాగా క్రమశిక్షణతో మెల్లమెల్లగా కదులుతూ పోతున్నారు.

నీళ్ళు ఎదల దాకా ఎదిగాయి.

గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. నీటిలోనే ఉన్నా ఒంటికి చెమటలు పట్టాయి.

ముందు నడిచిన వాళ్ళు నది మధ్యకు చేరుకున్నారు.

నీళ్ళు కుతికిల్ని ఒరుసుకొని తిరిగాయి. కాసేపు తిరిగీ కొంచెం కిందికి దిగాయి.

''ఇంగింతేలే! లోతు ఇంతేలే! రండి... రాండీ.. బిరబిరా నడవండి'' అంటూ ముందు నడిచిన వ్యక్తి మెడ పక్కకు తిప్పి గట్టిగా అరిచాడు.

నడకలు వడివడిగా పడుతున్నాయి.

'గుండలు ధడధడా' అదురుతున్నాయి. ఉన్న జనంలో సగం ఒడ్డుకు చేరుకున్నారు. నీళ్ళలో ఉన్న వాళ్ళను రమ్మని కేకేశారు. ఆ కేకలు అందుకొని నడక వేగం కాస్త పెంచారు. ఆ సగంలో సగం మంది కూడా ఒడ్డును పట్టుకున్నారు. ఇంకా వస్తున్న వాళ్ళను గడ్డన నిలబడున్నవాళ్ళు చేతులు ఊపుతూ పిలిచారు.

'కూటి ముందరా, ఏటిముందరా ఎక్కువసేపు ఉండకూడదు' అన్న సామెతలోని సత్యం తెలుసుకొని నీళ్ళల్లో ఉన్నవాళ్ళు త్వరత్వరగా కదులుతున్నారు.

ఇక వచ్చేసినాంలే, ఇంగ భయం లేదులే అన్న ధైర్యంతో ఊపిరి గట్టిగా పీల్చుకుంటూ ఉండగానే 'పై(న) ఏరు' ఉప్పెనై వచ్చింది. క్షణాల్లో గద్దలాగా తన్నుకొని పోయింది. కొట్టుకుపోతున్న వాళ్ళు 'రక్షించండి... రక్షించండ'నే మాటను నోరు ద్వారా కాకుండా చేతులు పైకెత్తి ఊపారు. ఆ ఘోర దృశ్యాన్ని చూసే ఒడ్డుననున్నవాళ్ళు అచేతనులై నెత్తీనోరు మొత్తుకొని అరిచారు. ఎత్తిన చేతులు అదృశ్యమయ్యే వరకూ గట్టువెంట వరదలాగే పరుగెత్తారు.

వరద రూపంలో... భయంకర ఆకారంలో... కురులు విరబోసుకొనీ... నోరు తెరచుకొనీ... ఉరికింది ఉగ్రగంగ.

చిక్కిన వాళ్ళను చిక్కినట్టుగా ఒడిసిపట్టుకొని కడుపులోకి దిగమింగింది. రౌద్ర రూపంలో, భీషణ స్వరూపంలో అరుస్తూ వెళుతున్న గంగ ఉదరంలో సుంకులమ్మ కొడుకూ, కోడలు కూడా చేరిపోయారు.

టి.వి. సుందరి పరకాయప్రవేశం చేసి గంగ ఉగ్రరూపాన్ని అప్పటికే తెరకెక్కించింది. రేడియో మధురవాణి రాష్ట్రమంతా కలయతిరిగి వరద ఉధృతిని గొంతెత్తి వినిపించింది. ఇళ్ళల్లో ఉన్న జనం టి.వి. బొమ్మకు కళ్ళు అతికించి చూస్తున్నారు. రేడియో శ్రోతలు చెవులు రిక్కించి వింటున్నారు. సెల్‌ఫోన్ మంత్రగత్తె కామ రూపంలో వెళ్ళి కావలసిన వాళ్ళ క్షేమ సమాచారాన్ని కనుక్కొని వచ్చింది. ప్రభుత్వ యంత్రాంగం వరద బాధితులను ఆదుకోవడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

పొద్దున వెళ్ళిన మనుమడు ఎంతకూ తిరిగి రాకపోయేసరికి సుంకులమ్మకు భయం పట్టుకుంది. అది ఎదిగి ఎదిగి గుండెకు ఒణుకు పుట్టించింది. పొడుచుకొని వస్తున్న చినుకులను చీల్చుకుంటూ బయటికి వెళ్ళింది.

''నారక్కొదినా... నా మనుమడొచ్చినాడా!''

''ఎరుకులప్ప మామా... మా పిల్లోడేమన్నా ఉండాడా'' అంటూ గుడిసె గుడిసె తిరిగింది. అక్కడ లేడని తెలుసుకొని టీ బంకు గుర్తొచ్చి అక్కడికెళ్ళింది. హోరుగాలికీ... జోరు వానకీ కొట్టుకొని వస్తున్న సుంకులమ్మను చూసి 'ఏయ్ ముసల్దానా! చస్తావ్.. వానలో నీకేం పని ... ఇంటికి పో' ఒకరిద్దరు గట్టిగా చెప్పారు. సుంకులమ్మకు ఆ మాటలు వినిపించలేదు. మనుమడు కనిపిస్తాడేమోనని చాలాసేపు వెతికింది. ఆ తర్వాత చేతకాక, వాన తాకిడికి ఓర్చుకోలేక ఏడుస్తూ వచ్చి గుడిసెలో కూలబడింది.

''ఈశ్వూరాల్యా! పిల్లగాడు కనిపించల్యా..! యాడున్నారో! ఏమో'' తనలో తాను అనుకుంటూ, కొడుకూ కోడలు వస్తే మనుమన్ని వెతికి తెస్తారని ఆశపడింది.

పలచని చీకటి పరచుకోవటానికి సిద్ధమైంది. వచ్చే చీకటిని పారదోలాలన్న ఆశతో సుంకులమ్మ గుడిసెలో దీపమై కూర్చుంది.

మనిషి గుడిసెలోనే ఉన్నా చూపులన్నీ బయటే ఉన్నాయి. జోరువానకు శ్రమ ఎక్కువై కాసేపు విశ్రాంతి తీసుకుంది.

గుడిసెల జనం ఊపిరి బిగబట్టుకొని వచ్చారు. వరదలాగే వచ్చారు. చినుకుల్లో తడవడం వల్ల కళ్ళల్లో కారే నీరును సుంకులమ్మ గమనించలేకపోయింది. ''బర్యా! కేశన్నా! మావాళ్ళేరీ'' అంది సుంకులమ్మ. చెప్పితే ముసిల్ది ఏమవుతుందోనన్న భయంతో... కేశన్న ఏదో చెప్పి వెళ్ళిపోయాడు.

''నాగలచ్చిమీ! బండోడా!యంగట్లచ్చిమీ! నా కొడుకూ కోడలు యనక వత్తాండారా!'' ఆత్రంగా అడిగింది. వాళ్ళు పలకకపోయేసరికి కీడు శంకించింది సుంకులమ్మ. ''యామండ్రా! మూగెద్దు మాద్రి అట్లుండారు! యాడ నా బిడ్డలు'' గద్గద స్వరంతో గట్టిగా అరిచింది.

పిడికెడు గుండె పుట్టెడు దుఃఖాన్ని అప్పటికే ఎత్తుకొని ఉండడంతో ఇక మోయలేకపోయింది.

''ఇంగ్యాడున్నారత్తా! గబ్బుముండ. నీ కొడుకూ కోడల్ని గంగ పొట్టన పెట్టుకుంది'' అంటూ బావురుమని ఏడ్చారు. సుంకులమ్మకు గుండె పగిలింది.



నిట్టనిలువునా కిందపడి మూర్ఛపో యింది. వచ్చినవాళ్ళలో తనవాళ్ళు లేక పోవడం చూసి గుడిసెల్లో దుఃఖం హంద్రీ నది కెరటాలై ఎగసింది.

ఆగిన వర్షం మళ్ళీ వచ్చింది.

ఆకాశమే కుండై నీళ్ళు ఒలకబోసింది. సుంకులమ్మను గుడిసెలోనికి ఎత్తుకొని పోయి మంచంమీద పడుకోబెట్టారు.

వానబోరు కరెంటు కళ్ళు పొడిచింది. చీకటి ముద్దలాగా ఊరు గుడ్డిదయింది.


అప్పటికి చాలా పొద్దుపోయింది. హంద్రీ నది నీరు గుడిసెల్లోకి మెల్లగా రాసాగింది. జనం మేల్కొనే వుండడం వల్ల వచ్చే ప్రమాదాన్ని పసిగట్టి అందిన వస్తువులను చేతులతో పట్టుకొని పరిగె ట్టారు. సుంకులమ్మ గుడిసెలోనే ఉందన్న సంగతి సగం దూరం వెళ్ళినాక కేశన్నకు గుర్తుకు వచ్చింది. వెనక్కి వచ్చాడు. ఎత్తుకొని పరిగెట్టాడు. ఎత్తు ఉన్నచోట కూర్చున్నారు. చెట్లు ఎక్కి కూర్చున్నారు. చెట్లు పట్టుకొని కూర్చు న్నారు. వరద పొంగులో గుడిసెలన్నీ కాయితాల పడవలైనాయి. తగ్గులో ఉన్న మిద్దెలన్నీ గంగ నెత్తిన గోపురాలైనాయి. ఇళ్ళు మడుగులైనాయి...!!

తెల్లారింది... వాన ఆగిపోయింది. రోగిలా గంగ నీరసించిపోయింది.

చెట్టు కొమ్మల్లో చిక్కుకొనీ... కంప చెట్లల్లో దాక్కొనీ... బురద మట్టిలో ఇరు క్కొనీ... రాళ్ళు రప్పలకు కొట్టుకొనీ... మృతదేహాలు దర్శనమిచ్చాయి. జంతు కళేబరాలు కనిపించాయి.

జీవంలేని తన వాళ్ళను చూసి గుండెలు బాదుకున్న వాళ్ళకు మునిసిపా లిటీ వాళ్ళు శవాలను ఉదారంగా దానమి చ్చారు. గుర్తుపట్టని శవాలను ఈడ్చి అవ తలకు పడేశారు. కొడుకు, కోడలు శవా లను చూసి సుంకులమ్మ కడుపు గుద్దు కుంది. తన గుడిసె పక్కనే ఉన్న గుంట లో తేలిన మనుమని శవాన్ని చూసి రొమ్ములు బాదుకుంది.

తగిన సమయంలో సరైన చర్యలు తీసుకోకపోవడం వల్లనే ఇంత ఘోర నష్టం జరిగిందని - ఒకపక్షంవాళ్ళు విరుచుకుప డ్డారు. సరైన సమయంలో చర్యలు తీసుకున్నందు వల్లనే ఎందరో ప్రాణాలు కాపాడగలిగాం అని ఆ పక్షానికి బదులిచ్చారు. ముందుజాగ్రత్త లేనందువ ల్లనే ఇంత ప్రాణనష్టం, ఆస్తినష్టం వాటిల్లిందని మరోపార్టీ ఘాటుగా తిట్టింది. ''మీ పార్టీల గొడ వలు మాకు వద్దు స్వామీ! మా ఆకలి తీర్చండి. మా కన్నీళ్ళు తుడవండి. మాకు గూడు కల్పించండి. మా గోడు వినండి'' అంటూ వరద బాధితులు రొమ్ములు కొట్టుకున్నారు. కన్నీరు కార్చారు. ఆ నీరుకు కరిగిన గుండెలు కరిగినాయి. కరగనివి రాళ్ళు లాగే ఉండిపోయాయి. కరిగినా... కరగకపో యినా.. మళ్ళీ ఎన్నికల్లో నిలవాలన్నా, గెలవా లన్నా ఆదుకోక తప్పదని అన్ని పార్టీలు ముందుకొ చ్చాయి.







బలం బాగా ఉన్న పార్టీ - భారీగా సాయం చేసింది.

కాస్త బలం తగ్గిన పార్టీ - తగినంత ఇచ్చింది.

బలహీనంగా ఉన్నది చేతనైనకాడగికి సహాయ పడింది.

ఆ ఇచ్చేటప్పుడు కూడా వచ్చే ఎన్నికల్లో మాకే ఓటు వెయ్యండని చెప్పకనే చెప్పుకున్నాయి. అన్నం ప్యాకెట్లు ఇచ్చారు. పాలు, నీళ్ళ ప్యాకెట్లు విసురు తూపోయారు. బియ్యం, కిరోసిన్, పంచెలు, చీరలు, దుప్పట్లు ఇచ్చారు. సుంకు లమ్మ యోగినిలా మారి శూన్యంలోకి చూస్తోంది - ఏమీ పట్టించుకోకుండా.

ఆడే పాడే వయసులో తల్లిని పోగొ ట్టుకుంది. తాగుబోతు తండ్రి దగ్గర భయంభయంగా బతికింది. తన ఎదు గుదలకోసమే తన యవ్వనాన్ని అమ్ము కోవటం కోసమే కాచుకుకూర్చున్న తండ్రిని విడిచి ఎక్కడికన్నా వెళ్ళి పోదాం అనుకుంటున్న తరుణంలో వెంకటన్నతో పరిచయమైంది. వెంక టన్న ప్రేమ... తాజ్‌మహల్ అను కుంది. అతని చేతిలో దారుణంగా మోసపోయింది సుంకులమ్మ. కన్న పేగు నీడలో బతుకు వెళ్లదీద్దామను కుంటున్న సమయంలో గర్భశోకానికి గురైంది. కొడుకు రూపంలో ఉన్న మనుమడ్ని చూసుకుని బతుకుదాం అని అనుకుంటే మనుమడు కూడా శవమై కనిపించాడు. తన బతుకు ఇక శవమే అనుకుంది. చనిపోవటానికి మార్గాలు తెలిసినా తనకు నచ్చినట్లే మరణించాలనుకుంది.

***

నష్టపరిహారం అంచనా వేసి ఇంటింటికెళ్ళి ఆర్థిక సహాయం చేస్తు న్నారు. దుఃఖితమతులు డబ్బుకోసం ఎగబడుతున్నారు. కొందరు గుంజుకో వడానికి ప్రయత్నిస్తున్నారు. పోలీ సులు పక్కనే ఉండడం వల్ల డబ్బు ఇచ్చేవాళ్ళు తిట్టుకుంటూ పంచుతు న్నారు. అందుతుందో... లేదో... అని అనుమానంతో కొందరు కట్టెలతో కొట్టు కున్నారు.

సుంకులమ్మ పట్టించుకోకుండా ఉండడం చూసి కేశన్న ఆమెను బలవం తంగా ఎత్తుకొనిపోయి డబ్బు ఇప్పిం చాడు. కొత్త నోట్లు విసుగ్గా లెక్కబెట్టి ఇచ్చిన వ్యక్తితో ''నాయనా! మల్లెప్పుడొ త్తాది వరద'' అంది సుంకులమ్మ. ముగించుకొని... పీడ తొలగించుకొని పోదామని పని గబగబ చేస్తున్న వ్యక్తికి హార్టుపోటు వచ్చినట్లయింది. వెంటనే తేరుకుని ''ఎందుకే ముసలిముండా! మళ్ళీ మమ్మల్ని చంపుకు తిందామనా! మళ్ళీ వరద వస్తే ఇంకో దఫా లెక్క (డబ్బు) గుంజుకుందామనా'' పళ్ళు బిగబట్టి కొట్టినట్లు మాట్లాడినాడు.

''ల్యా! నాయనా! తప్పు మాట్లాడుతుండావు. లచ్చలు యలవసేసే బిడ్డల్ని పోగొట్టుకున్నాను. ఇంగ నువ్విచ్చే దుడ్డుతో నాకేం పని...! మల్లెప్పుడొ త్తాదో వరద సెప్పు, దాంట్లో పడి నా కొడుక్కాడికి పోవల్ల'' నిర్వేదం, నిరాశ, నిట్టూర్పు, నిర్లిప్తత... అన్ని వేదనలూ కలబోసుకొని చెప్పింది సుంకు లమ్మ. ★